# ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

## ప్రసంగం

# శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్

## ఆంధ్రప్రదేశ్ గవర్నర్

ఆషాఢ - బహుళ 1, 1946

22 జూలై, 2024

మాన్యశ్రీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనపరిషత్తు,
మాన్యశ్రీ సభాపతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మరియు
గౌరవ శాసనమండలి సభ్యులు
అందరికీ నా శుభాభివందనాలు...

1. 2024 సాధారణ ఎన్నికల తరువాత తొలిసారిగా సమావేశమవుతున్న రాష్ట్ర శాసనమండలి ఉమ్మడి సమావేశానికి హాజరవుతున్న కొత్తగా ఎన్నికైన రాష్ట్ర శాసనసభ సభ్యులకు మరియు శాసనపరిషత్తు సభ్యులకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపేందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలను ప్రశంసించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నందుకు సంతోషిస్తున్నాను. మార్పు కావాలనే వారి ఆకాంక్షలో ఎట్టి సందేహం లేదు. ఇప్పుడు వారి ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత మీ పై ఉంది.

2. గౌరవ సభ్యులారా, అమరజీవి పొట్టి శ్రీరాములు మహోన్నత త్యాగం వల్ల కర్నూలు రాజధానిగా 01-10-1953 తేదీన మొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందనే విషయం మీకందరికీ తెలుసు. ఆ తరువాత 01-11-1956 తేదీన ఈ రాష్ట్రం పునర్ వ్యవస్థీకరించబడింది. హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలను హైదరాబాదు రాజధానిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో

కలపడమైనది. ఆ విధంగా అనేక మంది తెలుగు ప్రజలు హైదరాబాదుకు తరలివచ్చారు.

3. మరలా 2014, జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణను మరోసారి చవిచూడాల్సి వచ్చింది. ఇది అందరికీ అత్యంత నష్టదాయకమైన అనుభవంగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా, అప్రజాస్వామికంగా, భాగస్వాములతో తగినంత చర్చలు జరపకుండా సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌ను విభజించడం జరిగింది. ఇది అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల హృదయంపై మాయని మచ్చగా మిగిలింది. పలుమార్లు రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల అల్లకల్లోలం ఏర్పడింది. ఫలితంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆంధ్ర ప్రజలు సుదీర్ఘ కాలంపాటు అభివృద్ధికి మరియు పురోగతికి నోచుకోలేకపోయారు. ఈ రోజు, ప్రజలు తమ రాష్ట్రాన్ని మరలా పునర్ నిర్మించే పనిని చేపట్టాల్సి ఉంది.

4. కాలం గడుస్తున్న కొద్దీ, 2014, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ఆంధ్రప్రదేశ్‌కు అది కోల్పోయిన సమృద్ధి మరియు అభివృద్ధి అవకాశాలకు తగినంత పరిహారం ఇవ్వలేదని స్పష్టమైంది. రాష్ట్ర విభజన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కనీ వినీ ఎరుగని ఒత్తిడిని కలిగించింది. ఆస్తులు, అప్పుల పంపిణీలో స్పష్టమైన అసమానతలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్ర జనాభాలో 58.32 శాతం ఉన్న రాష్ట్రం అశాస్త్రీయ విభజన వల్ల కేవలం

46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయి. హైదరాబాదు నగరాన్ని కోల్పోవడం వల్ల ఆర్థిక నష్టం జరిగింది. రుణభారం ఎక్కువైంది. ప్రభుత్వ సంస్థలలో ప్రవేశాన్ని కోల్పోవడం జరిగింది. జాతీయ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ పిఎస్‌యులు మరియు ఉన్నత విద్యా సంస్థలు మొదలైనవాటిని కోల్పోవడం జరిగింది.

5. విభజనకు శాస్త్రీయ ప్రమాణాలను పాటించలేదనే విషయాన్ని గమనించవచ్చు. అవశేష రాష్ట్రం భారీ రెవెన్యూ లోటును వారసత్వంగా పొందినప్పటికీ, జనాభా ప్రాతిపదికన రుణాన్ని పంచడం జరిగింది. ప్రాంతం ఆధారంగా ఆస్తులు, వినియోగం ఆధారంగా విద్యుత్తును పంపిణీ చేయడం జరిగింది. అన్నింటికంటే ఘోరంగా విద్యా సంస్థలను ఎటువంటి ఆధారం లేకుండా విభజించడం జరిగింది. ఈ అంశాలన్నీ సేవల రంగాన్ని 51 శాతం నుండి 44 శాతానికి తగ్గించడంతో ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులకు గురైనాయి. తలసరి ఆదాయం కూడా ఉమ్మడి రాష్ట్రంలో రూ.1,06,176 ఉండగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో రూ.93,121 కి పడిపోయింది.

6. రాష్ట్ర విభజన వల్ల ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ బడ్జెటు పరిమితులు, మౌలిక సదుపాయాల లోపాలు, అపరిష్కృత సమస్యలు వంటి సవాళ్ళను లెక్కచేయకుండా 2014-19 కాలంలో ప్రతి

సంక్షోభాన్ని ప్రభుత్వం అవకాశంగా మార్చుకుంది. చైతన్యవంతమైన 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' కు ప్రభుత్వం గట్టి పునాది వేసింది.

7. అప్పటి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క అంతర్లీన బలాలు, దాని 974 కి.మీ. సముద్ర తీరం, నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధి అవకాశాలు మరియు తయారీ కార్యకలాపాలకు అవసరమైన వాతావరణంపై దృష్టి సారించింది. సారవంతమైన నదీ మైదానాలు వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలకు తోడ్పడుతున్నాయి. రాష్ట్రం మీదుగా మూడు పారిశ్రామిక కారిడార్లు వెళుతున్నాయి. సుసంపన్నమైన సహజ మరియు మానవ వనరులు ఉన్నాయి.

8. 2014-19, ఐదేళ్ళ కాలంలో రాష్ట్ర పనితీరును పరిశీలిస్తే అభివృద్ధి, సంక్షేమం మధ్య స్పష్టమైన సమతుల్యత ఉంది. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో ప్రతిష్టాత్మక పట్టిసీమ ప్రాజెక్టును రికార్డు సమయంలో ఏడాదిలో పూర్తి చేయడం జరిగింది. పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేసి, 2021 నాటికి అందుబాటులోకి తీసుకురాగలిగి ఉండాలి. ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల ప్రాధాన్యత, కరవు నివారణ చర్యలు, రియల్ టైం గవర్నెన్స్, ల్యాండ్ పూలింగ్ ద్వారా అమరావతి ప్రాంత అభివృద్ధి, కొత్త సచివాలయం, శాసనసభ భవనాల నిర్మాణం మున్నగునవి పేర్కొనదగిన కొన్ని ఉదాహరణలు.

9. 2014-19 మధ్య కాలంలో సాధించిన మైలురాళ్ళన్నీ గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి నాయకత్వం వల్లనే సాధ్యమైంది. ఈ పాలనలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులలో రాష్ట్రం నెం.1 రాష్ట్రంగా అవతరించింది. కియో మోటార్స్ వంటి దిగ్గజ ఎఫ్‌డిఐలను రాష్ట్రం ఆకర్షించింది. ఆయన సమర్ధ నాయకత్వంలో, రాష్ట్రం వివిధ రంగాలలో వివిధ పెట్టుబడులను ఆకర్షించింది. కాకినాడ సెజ్ పోర్ట్, భావనపాడు, రామాయపట్నం ఓడరేవుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విమానాశ్రయాల విస్తరణ, రాష్ట్ర రహదారి నెట్‌వర్క్‌ను పెంచింది. వృద్ధాప్య పింఛన్ల పెంపుదల. రైతు రుణమాఫీ. విద్యార్థులకు ఉపకార వేతనాలు. ఇళ్ళ నిర్మాణం వంటి సంక్షేమ చర్యలతో మౌలిక సదుపాయాల అభివృద్ధి సమతుల్యంగా ఉంది. ఈ అభివృద్ధి, సంక్షేమ చర్యలు 2014-19 మధ్య 13.5 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధికి దారితీశాయి.

10. రాష్ట్రం అత్యున్నత అభివృద్ధి పథంలో పయనించడానికి సిద్ధమైన సమయంలో, 2019లో జరిగిన పాలన మార్పు మళ్ళీ నవ్యాంధ్రప్రదేశ్‌కు విఘాతం కలిగించింది. ఇప్పటికే 2014లో విభజన భారాన్ని చవిచూసిన రాష్ట్రం, ప్రజలను బెదిరించి, అధికారులను నిరుత్సాహపరచిన అసమర్ధ పాలన రూపంలో మరో పెద్ద పరాజయాన్ని చవిచూడటం దురదృష్టకరం. వాస్తవానికి, జూన్, 2014లో జరిగిన

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణతో పోలిస్తే 2019-24 కాలంలో జరిగిన హాని మరియు నష్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. 2019, జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వం 'ప్రజావేదిక' కూల్చివేతతో విధ్వంసకర విధానంతో ప్రారంభించింది. అది 2024, జూన్‌లో పాలన ముగిసే వరకు నిరంతరాయంగా కొనసాగింది.

11. ఈ పాలనలో, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రజలు భయాందోళనకు గురయ్యారు మరియు జీవించే స్వేచ్ఛనూ కోల్పోయారు. 'పాలన-ప్రతీకార' రాజకీయాలు రాష్ట్రం యొక్క శ్రేయస్సు మరియు అభివృద్ధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గౌరవ హైకోర్టు రాష్ట్రంలో 'రాజ్యాంగపరమైన విచ్ఛిన్నం' జరిగిందా అనే అంశంపై న్యాయ విచారణ జరిపించాలని కూడా కోరింది. 'బ్రాండ్ ఏపి' కి అతిపెద్ద నష్టం జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చెప్పుకోదగ్గ కంపెనీలు ఏవీ ముందుకురాలేదు. అన్ని స్థాయిలలో అవినీతి విధానాలతోపాటు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆదాయాన్ని ఆర్జించే శాఖలలో పాలనా సాధనాలను ఆయుధంగా మార్చుకోవడం, చెక్స్ & బ్యాలెన్స్ దెబ్బతినడం వల్ల అనేక ప్రభుత్వ సంస్థలు మరియు ప్రైవేటు కంపెనీలు నిర్వీర్యమయ్యాయి. అప్పటికే ఉన్న ఔత్సాహిక పెట్టుబడిదారులు మరియు పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ నుండి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లవలసి వచ్చింది.

12. ఈ అనిశ్చిత వాతావరణం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపటం ప్రారంభించుటయే కాక, మొత్తంగా ప్రజల విశ్వాసాన్ని, ముఖ్యంగా పెట్టుబడిదారుల నమ్మకాన్ని ప్రభావితపరచి, వారిని గందరగోళానికి గురిచేసింది. ఆదాయ వృద్ధి పరిమితంగా ఉన్నప్పటికీ ఖర్చులు అపరిమితంగా ఉన్నాయి. అప్పులు మరియు చెల్లింపు బాధ్యతలు బాగా పెరిగాయి.

13. నిధుల మళ్ళింపు, అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ అధిక పన్నులు విధించడం, విద్యుత్ రంగం రుణాలు పెరగడం, మూలధన వ్యయాన్ని నిర్లక్ష్యం చేయడం ద్వారా ఆర్థిక దుర్వినియోగానికి కారణమై, చివరకు ఆర్థిక వ్యవస్థ మందగమనానికి దారితీసింది. వనరులలో అపారమైన అంతరాన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకొని తరచూ పూరించడానికి ప్రయత్నించడం మరియు ప్రభుత్వ వ్యయంపై ఖర్చు చేయమని ఒత్తిడి చేయడం ద్వారా ఈ ప్రక్రియలో కార్పొరేషన్లను బలహీనపరచడం జరిగింది.

14. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్న కారణంగా బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నందున, చాలా మంది విక్రేతలు మరియు కాంట్రాక్టర్లు ఉపశమనం కోసం గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి, ప్రభుత్వంపై కేసులను దాఖలు చేశారు. మునుపెన్నడూ జరగని విధంగా బిల్లుల చెల్లింపుల కోసం దాదాపు 25,000 కేసులు

దాఖలు అయ్యాయి. అనేక కేసుల్లో అధికారులపై వ్యక్తిగత హాజరు మరియు అరెస్టు వారెంట్లతో కూడిన ధిక్కార కేసులు నమోదైన ఫలితంగా బ్యూరోక్రసీని అవమానించడం మరియు వారిని బలి పశువులను చేయడంతోపాటు పరిపాలనా యంత్రాంగాన్ని పూర్తిగా నిరుత్సాహపరచేందుకు దారితీసింది.

15. 2014-19 సంవత్సరంతో పోల్చినట్లయితే 2019-24 కాలంలో మూలధన వ్యయాన్ని 60 శాతం మేరకు తగ్గించడమయింది. గణనీయమైన ప్రధాన పనులను చేపట్టే అటువంటి జల వనరులు, రవాణా, రోడ్లు, భవనాలు వంటి శాఖలు నిధుల కొరత కారణంగా ఎలాంటి పనులను చేపట్టలేకపోయాయి. ఈ కాలంలో జల వనరులపై మూలధన వ్యయం 56 శాతం మేరకు తగ్గింది మరియు రోడ్లు, భవనాలపై భయంకరంగా 85 శాతానికి తగ్గింది.

16. ఈ కాలంలో రాష్ట్ర స్వంత పన్ను రెవెన్యూకి సంబంధించిన సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు 12.8 శాతం నుండి 8.1 శాతానికి పడిపోయింది. మరోవైపు, రెవెన్యూ వ్యయం 7.8 శాతం నుండి 10.5 శాతానికి పెరగగా, మూలధన వ్యయం వృద్ధి దారుణంగా 26.4 శాతం నుండి 3.4 శాతానికి క్షీణించింది.

17. 2019-24 మధ్య కాలంలో ప్రభుత్వ రుణానికి మూలధన వ్యయంలో తక్కువ వాటా సంభవించడం అంటే రెవెన్యూ వ్యయాన్ని కూడా అప్పు తెచ్చిన నిధుల నుండి ప్రభుత్వం పూరించిందనడానికి సూచికగా ఉంది. తలసరి ఆదాయంలో 'సిఏజిఆర్' 9.7 శాతం మాత్రమే ఉండగా, తలసరి రుణంలో 'సిఏజిఆర్' అధికంగా 14 శాతం ఉంది. ఎటువంటి పెట్టుబడి సమీకరణ జరగనందున ఇది మునుపటి ప్రభుత్వం యొక్క ఆర్థిక దుస్థితిని తెలియజేస్తున్నది.

18. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర వృద్ధికి కేంద్ర బిందువుగా భావించిన అమరావతి రాజధాని ప్రాంతం పూర్తిగా నాశనమైంది. అమరావతి కలను నీరుగార్చే ప్రయత్నం చేస్తూ, ప్రభుత్వం వికేంద్రీకరణ పాలన ముసుగులో మూడు రాజధానుల ఆలోచనతో ప్రజలను గందరగోళానికి గురిచేసింది.

19. 2019-24 కాలంలో, ఎటువంటి నీటిపారుదల ప్రాజెక్టు, క్రొత్త పరిశ్రమలు, రోడ్లు, భవనాలు, ఆసుపత్రులు, త్రాగునీటికి సంబంధించిన ఎటువంటి మౌలిక సదుపాయాలను చేపట్టలేదు. ఇంధన రంగం మరియు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అవగాహన ఒప్పందాలను రద్దు చేసి ప్రభుత్వం ప్రతికూల వైఖరిని మరింతగా ప్రదర్శించింది. ఇటువంటి విధ్వంసకర నిర్ణయాలు, వాటి పర్యవసానాలను పట్టించుకోకపోవడం యువతలో, ఉద్యోగార్థులలో అశాంతికి దారి తీసింది. అనిశ్చిత వాతావరణం నెలకొనడం వలన

చివరికి యువత చట్టవిరుద్ధమైన పదార్థాలకు బానిసలు కావడం, తద్వారా మాదకద్రవ్యాల ముప్పు ఏర్పడుతున్నది.

20. మానసిక అశాంతి మరియు వేదన రాష్ట్ర భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు మాట్లాడే ప్రజలు ప్రభుత్వం యొక్క స్ఫూర్తిలేని చర్యలతో కలత చెంది, నిరుత్సాహపడ్డారు. 21వ శతాబ్దంలో తమను ముందుకు తీసుకువెళతారని ప్రభుత్వంలో మార్పు కోసం వారు ఆత్రుతగా మరియు నిర్విరామంగా ఎదురుచూశారు.

21. 1996 నుండి 2004 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన ప్రగతిశీల ప్రజా విధానాలు, నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజల సాధికారతకు దారితీసి అత్యధికంగా సంపాదిస్తున్న భారతీయ ప్రవాసులుగా ఉన్న వారిలో ఒకరిగా ఉండటానికి వీలు కల్పించాయి. రాష్ట్ర ప్రజలు. ఎన్ఆర్ఐలు మరియు ఇతర మద్దతుదారులు గత ప్రభుత్వం యొక్క కూల్చివేత విధానాన్ని ఖండించడంతో ప్రభుత్వ మార్పు పరాకాష్టకు చేరుకుంది. అపూర్వమైన 93 శాతం స్ట్రయిక్ రేట్ నమోదు చేస్తూ ఎన్డిఎకు భారీ మరియు చారిత్రాత్మక ప్రజాతీర్పును ఇవ్వడమయింది, తద్వారా ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పునరుద్ఘాటించడమయింది.

22. భవిష్యత్తు దృష్టితో తన విధులను నిర్వర్తించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో విజ్ఞతను చూపినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలను నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు అనుకూలంగా ఈ చారిత్రాత్మక తీర్పులో భాగం కావడానికి వివిధ ప్రాంతాల నుండి ఆంధ్రా ప్రజలు తరలి వచ్చారు. క్రొత్త ప్రభుత్వం శాసనసభలో తాజా మరియు అనుభవజ్ఞులైన గౌరవనీయ సభ్యుల సంపూర్ణ సమ్మేళనాన్ని కలిగి ఉంది. సుపరిపాలన ప్రయోజనంతో మరియు సహకార సమాఖ్య స్ఫూర్తితో సరైన విధానాలను రూపొందించడంలో కీలకపాత్ర పోషించే సభ్యులందరినీ నేను మరోసారి స్వాగతిస్తున్నాను.

23. గౌరవనీయులైన సభ్యులారా, ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క అద్భుతమైన గతాన్ని గుర్తు చేసుకోవడం కూడా ముఖ్యమని నేను భావిస్తున్నాను. భారతదేశపు రైస్‌బౌల్ - 'అన్నపూర్ణ'గా ప్రసిద్ధి చెందిన ఈ రాష్ట్రం ఆహార భద్రతను కల్పించడంలో ఇతర రాష్ట్రాలకు మద్దతునిస్తుంది. స్వయం సహాయక బృందం విధానంలో అగ్రగామిగా, పేద మహిళల్లో పారిశ్రామికతత్వం, ఆదాయ మరియు పొదుపు విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఉదాహరణగా నిలిచింది. సంక్షేమం మరియు అభివృద్ధికి సంబంధించిన అన్ని

రంగాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించడం అనేది రాష్ట్రం యొక్క దార్శనికతకు మూలస్తంభం.

24. పారదర్శకత లోపించిన గత ప్రభుత్వ దుష్పరిపాలన, గత ఐదేళ్ళ పాలనలో వ్యవస్థల వైఫల్యం మరియు విపరీతమైన అవినీతి గురించిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలనే ఒత్తిడి ఈ ప్రభుత్వం పై ఉంది. ఆ ప్రకారంగా, నిధుల వినియోగంలో అనేక అంతరాలు, దుర్వినియోగం ఫలితంగా రాష్ట్ర ఖజానాకు మరియు రాష్ట్ర సహజ వనరుల మూలాలకి భారీ నష్టం వాటిల్లిందని విశదీకరిస్తూ నా ప్రభుత్వం అనేక శ్వేతపత్రాలను విడుదల చేసింది. శ్వేత పత్రాల యొక్క కొన్ని కీలక విషయాలను నేను సమర్పిస్తున్నాను.

25. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరాన్ని పూర్తి చేయడమనేది అత్యంత ప్రాముఖ్యం. పోలవరం ప్రాజెక్టు పూర్తిగా పట్టాలు తప్పింది. రివర్స్ టెండరింగ్‌ను ప్రవేశపెట్టి, అంగీకరించిన కాంట్రాక్టులను రద్దు చేయడం వల్ల ప్రాజెక్టుకు మాత్రమే కాకుండా నదులను అనుసంధానం చేసి, ప్రతీ ఎకరం భూమికి సాగునీటిని అందించాలనే ప్రభుత్వ భావనకు కూడా తీరని నష్టం వాటిల్లింది.

26. మూడు రాజధానుల ఏకపక్ష ప్రకటన ఫలితంగా రాష్ట్రం కోసం 1,631 రోజుల రైతుల నిరసన, రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ

అధికార పరిధిని 6,993 చ.కి.మీ.కు కుదించడం, ప్రాంతీయ బృహత్తర ప్రణాళికలను రూపొందించడాన్ని ప్రక్కన పెట్టడం, 191 ఎకరాలలో మాత్రమే భూసేకరణను పూర్తి చేయడం వంటి కొన్ని సంఘటనలు సిఆర్‌డిఏలో పురోగతిని అడ్డుకునే విధంగా ఉన్నాయి. ఇది పెట్టుబడి మరియు వృద్ధి అవకాశాల నష్టంతోపాటు సుమారు 7 లక్షల ఉద్యోగాల నష్టానికి మరియు రూ.2 లక్షల కోట్ల సంపద నష్టానికి దారితీసిందని అంచనా వేయడమయింది.

27. విద్యుత్ రంగంలో సంస్కరణలను 1990లలో ప్రవేశపెట్టడం ద్వారా దేశంలోనే మొదటి రాష్ట్రంగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ 1996 నుండి 2004 వరకు ఇంధన సమృద్ధిని సాధించింది. విభజన తర్వాత రాష్ట్రం రోజుకు 22.5 ఎంయుల ఇంధన లోటును ఎదుర్కొంది. మరలా, ఇంధన రంగంలో 2వ ఉత్పాదనల సంస్కరణలను తీసుకురావడం ద్వారా మరియు పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం ద్వారా 2018 నాటికి ఇంధన మిగులు రాష్ట్రంగా మారింది. ఇటీవల కాలంలో రాష్ట్రం కోలుకోలేని నష్టాన్ని చవిచూసింది. 2019-24 కాలంలో రాష్ట్ర ఇంధన రంగం కూడా రూ. 1,29,503 కోట్ల మేర భారీ నష్టాలకు గురయింది.

28. భూమి, గనులు, ఖనిజాలు మరియు అడవుల వంటి సహజ వనరుల దుర్వినియోగం విస్తృతం అయింది. 2019-24 మధ్య కాలంలో

భూ ఆక్రమణలు, ఇంటి స్థలాల పట్టాల కేటాయింపులో దుర్వినియోగం, భూమి కేటాయింపులో ఉల్లంఘనలు, అనర్హులైన లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాల కేటాయింపు, 2023, రీ-సర్వే మరియు ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. మొత్తంగా 1.75 లక్షల ఎకరాలలో 35,576 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేయడమయింది మరియు ఆస్తిని కలిగి ఉండటం అనే ప్రజల ప్రాథమిక హక్కును దెబ్బతీసింది.

29. ఇసుక మరియు ఖనిజ సంపదను కొల్లగొట్టడం ఖజానాకు భారీ నష్టాన్ని కలిగించే మరియు అవినీతికి దారితీసిన మరొక అంశం. ఈ రంగాలలో అక్రమ కార్యకలాపాల వల్ల ప్రాథమికంగా రూ.19,000 కోట్ల నష్టం వాటిల్లిందని నా ప్రభుత్వం అంచనా వేసింది. అనైతిక ఇసుక విధానం వల్ల 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోయారు. అసమర్థ, అసమంజస విధాన రూపకల్పన మరియు అమలులో అలసత్వం కారణంగా 2019-2024 మధ్యకాలంలో రూ. 9,750 కోట్ల మేరకు ఖనిజ రాబడిలో సంచిత నష్టం వాటిల్లింది.

30. పర్యావరణానికి తీవ్ర నష్టం జరిగింది. అడవుల నుంచి లభించే విలువైన ఎర్రచందనం విక్రయాల వల్ల 2014-2019 మధ్య రూ.1,623 కోట్ల ఆదాయం రాగా, ఎర్రచందనం స్మగ్లింగ్ వల్ల 2019-2024 మధ్య రూ.441 కోట్లకు ఆదాయం పడిపోవడం

జరిగింది. విశాఖపట్నంలోని రుషికొండ మరియు మడ అడవుల విధ్వంసం వల్ల రాష్ట్ర వారసత్వ సంపదను, సంస్కృతిని కూడా దెబ్బతీయడం జరిగింది.

31. గొంతు విప్పిన అసమ్మతి గళాలను వేధించడం ద్వారా 2019-2024లో ప్రభుత్వం శాంతిభద్రతల యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసింది. మహిళలు, చిన్నారులపై నేరాలు, అమాయక ప్రజలపై ముఖ్యంగా ఎస్‌సిలు, ఎస్‌టిలు మరియు ఇతర బలహీన వర్గాలపై అఘాయిత్యాలు పెరిగాయి. చట్టబద్ధమైన పాలనను కొనసాగించగలదనే ప్రభుత్వ సామర్థ్యం పై ప్రజలకు నమ్మకం పోయింది.

32. రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయ మార్గాలను కూడా గత ప్రభుత్వం అపహాస్యం పాలు చేసింది. ఎక్సైజ్ పై వ్యాట్‌ను తగ్గించి, ప్రత్యేక మార్జిన్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లకు మళ్ళించడం జరిగింది. లేనట్లయితే ఇది ప్రభుత్వానికి రాబడిగా సమకూరేది. ఎపిఎస్‌బిసిఎల్ ద్వారా విక్రయించబడిన మద్యం ధరపై ప్రభుత్వం అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకాన్ని విధించింది మరియు ఎపిఎస్‌డిసి ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే నిమిత్తం ఆ మొత్తాన్ని వసూలు చేసింది. అధిక ధరలకు నాణ్యత లేని మద్యాన్ని ఎపిఎస్‌బిసిఎల్ సరఫరా చేయడం ప్రారంభించింది మరియు గుర్తింపులేని బ్రాండ్‌లను

ప్రవేశపెట్టింది. సరిహద్దు జిల్లాలలో ఐఎమ్ఎఫ్ఎల్ అక్రమ రవాణా వల్ల అనైతిక ఆర్థిక వ్యవస్థ పెరిగింది. ఈ విధాన పద్ధతులు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయ మార్గాలకు కోలుకోలేని నష్టాన్ని కలిగించాయి.

33. తగ్గిన రాష్ట్ర ఆదాయం ఫలితంగా అత్యవసరంగా చేయాల్సిన కనీస చెల్లింపు బాధ్యతా వ్యయాన్ని భరించడం కూడా నూతన ప్రభుత్వానికి కష్టతరంగా మారింది. జీతాలు, పింఛన్ల భారీ బకాయిలు, సుమారు రూ.10 లక్షల కోట్ల రుణ భారానికి రుణం తిరిగి చెల్లింపులు, విద్యుత్ రంగ బకాయిల చెల్లింపులు, పౌర సరఫరాలు, ఇతర అప్పుల చెల్లింపులు సవాలుగా మారడంతో గత ఐదేళ్లలో మొత్తం అప్పులు రెట్టింపు కంటే మించిపోయాయి.

34. ప్రభుత్వ పరిపాలనను తిరిగి గాడిలో పెట్టడం చాలా సవాలుతో కూడుకున్న పని. నా ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడం ప్రారంభించడం ద్వారా "సూపర్ సిక్స్" వాగ్దానాలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది.

35. నా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డిఎస్సిని ప్రకటించడం, ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం, సామాజిక భద్రత పింఛన్లను రూ.4,000/-లకు పెంచడం, నైపుణ్య గణన నిర్వహించడం మరియు

పేదలకు అత్యంత నాణ్యమైన ఆహారాన్ని రూ. 5/-ల అతి నామమాత్రపు రేటుతో అందించడానికి అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించడం మరియు ఉచిత ఇసుక సరఫరా చేయడం వంటి వివిధ చర్యలతో తన ట్రేడ్‌మార్క్ అయిన ప్రజాకేంద్రీకృత పరిపాలనను ప్రారంభించింది. నా ప్రభుత్వం ఇతర ముఖ్యమైన చర్యలను కూడా ప్రారంభిస్తుంది.

36. గౌరవనీయ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పూర్తి సహకారంతో గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారు మరియు గౌరవనీయ ఉప-ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమర్థవంతమైన మరియు నిరూపితమైన నాయకత్వంలోని నా ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో అన్ని యత్నాలను చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను.

37. ఈ ప్రక్రియను మొదలుపెడుతూ, గౌరవ ముఖ్యమంత్రి గారు న్యూఢిల్లీ వెళ్లి గౌరవ ప్రధానమంత్రి మరియు ఇతర సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి ఆర్థిక పరిస్థితిని వారికి వివరించడం జరిగింది. ఈ పర్యటనలో, కేంద్ర ప్రభుత్వం చేయూతను అందించి మరియు రాష్ట్రానికి ఉదారంగా సహాయాన్ని అందించాలని ప్రత్యేక విజ్ఞప్తులు చేయడం జరిగింది.

38. ప్రస్తుతమున్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర ప్రజలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

39. ఆధారంగా ఉన్న సహజ వనరులు మరియు మానవ విలువల వ్యవస్థను భారీగా కోల్పోవడానికి దారితీసిన తీవ్ర విధ్వంసం, నిజంగా పునర్నిర్మాణ ప్రక్రియను కష్టతరం చేస్తుంది మరియు ఇది కొంత సమయాన్ని తీసుకుంటుంది. పూర్తి నష్టాన్ని అంచనా వేయడం, వనరుల సమీకరణ మరియు అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించడం చాలా సంక్లిష్టమైన పని.

40. ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించడానికి సమిష్టి ఆలోచన, మేధావులు మరియు విద్యావేత్తలతో విస్తృతమైన చర్చలు అవసరం. 2047 నాటికి వికసిత్ భారత్ అనే నూతన అభివృద్ధి నమూనా దృష్ట్యా స్వల్ప, మధ్యస్థ మరియు దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా మొత్తం అభివృద్ధి సంబంధిత వ్యవస్థను పునఃప్రారంభించే మార్గాలను కనుగొనడం కూడా ఇందులో చేరి ఉంటుంది. గత ఐదేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన వాస్తవ నష్టం ఇంతవరకు బహిరంగ చర్చకు రాలేదు. 2019-24 వరకు జరిగిన దుష్పరిపాలన, నియంత్రణ యంత్రాంగాల పట్ల కొరవడిన నమ్మకం పెట్టుబడిదారులలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ని దెబ్బతీసింది. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ని నిలబెట్టడానికి మరియు

నమ్మకాన్ని తిరిగి పొందడానికి ప్రజలు ఇప్పుడు ఎన్‌డిఏ కూటమికి బలమైన తీర్పును ఇచ్చారు.

41. గౌరవనీయులైన సభ్యులారా, సాధారణంగా ఎన్నికల్లో గెలవడం మరియు బాధ్యతలను స్వీకరించడం సంతోషకరమైన విషయం. కానీ, ఇప్పుడు మనం విభిన్నమైన మరియు క్లిష్టతరమైన పరిస్థితులలో కలుస్తున్నాము - బహుశా దేశంలోనే మొదటిసారిగా సభ్యులు సంతోషించే స్థితిలో లేరు మరియు ప్రజల ఆకాంక్షలను తక్షణమే నెరవేర్చే మార్గాన్ని కలిగి లేరు. దీనిని దృష్టిలో ఉంచుకుని, అర్ధవంతమైన చర్చల తరువాత బడ్జెట్‌కు వెళ్ళాలని నా ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

42. రాష్ట్ర విభజనకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నందున, నా ప్రభుత్వం చొరవ తీసుకుని, సామరస్య పూర్వక పరిష్కారాలను త్వరగా కనుగొనాలనే ఉద్దేశ్యంతో న్యూఢిల్లీలో గౌరవనీయులైన ప్రధానమంత్రిగారితో సహా కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత అధికారులను కలుసుకోవడం జరిగింది మరియు తెలంగాణా ప్రభుత్వంతో సమావేశం కావడం జరిగింది.

43. ప్రజాస్వామ్యాన్ని పునఃస్థాపించడానికి మరియు అపూర్వమైన తీర్పుతో ప్రజాహిత ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు చూపిన సంకల్పాన్ని అభినందించాల్సిన అవసరం ఉంది.

ఈ సంక్షోభ సమయంలో రాష్ట్రం తన పూర్వవైభవాన్ని తిరిగి పొందడంలో ఇది సహాయపడుతుంది.

44. స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమైన మాటలతో నా ప్రసంగాన్ని ముగించాలనుకుంటున్నాను.

*"మనమేమిటో మరియు మనకు మనంగా ఎలా ఉండాలనుకుంటున్నామో, దానికి మనమే బాధ్యత వహిస్తాము, దానిని మనమే చేయగల శక్తి మనకు ఉంది. మనమెప్పుడు ఎలా ఉన్నామో, అది మన స్వీయగత చర్యల ఫలితమై ఉన్నట్లయితే, భవిష్యత్తులో మనం ఎలా ఉండాలనుకుంటున్నామో దానిని ప్రస్తుత చర్యల ద్వారా చేయవచ్చునని అది తప్పక చెబుతుంది. కాబట్టి మనం ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలి"*

// జైహింద్ //